ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఐదో కిలోమీటర్ ఊటవాగు వద్ద నిలిచిపోయిన సైడ్ లైనింగ్ పనులు



పోతిరెడ్డిపాడు ఎగువ నదిలోకి తీసిన అప్రోచ్ కాల్వ దుస్థితి



పూర్తికాని పోతిరెడ్డిపాడు విస్తరణ..!

- వైసీపీ పాలనలో మాటల హడావిడి
- మూడేళ్ల గడువు ముగిసినా ముందుకు సాగని పనులు
- దిగువకు 80 వేల క్యూసెక్కుల నీరు లేనట్లే
- ఇప్పటి వరకు జరిగింది 30 శాతం పనులే
- బిల్లులు అందక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- రాయలసీమకు తప్పని తాగు, సాగు నీటి కష్టాలు

నంద్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి)/జూపాడుబంగ్లా: 'పోతిరెడ్డిపాడు నీటి తరలింపు సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 క్యూసెక్కులకు పెంచుతాం. శ్రీశైలం నుంచి వృథాగా సముద్రంలోకి పోయే నీటిని రాయలసీమకు మళ్లిస్తాం' అంటూ గత వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. ఇదంతా ఆర్భాటమేగాని పనులు చేసిందేమీ లేదు. కాస్తో కూస్తో పనులు చేసినా.. కాంట్రాక్టర్లకు డబ్బులు కూడా చెల్లించలేదు. వెరసి పోతిరెడ్డిపాడు విస్తరణ పనులు ముందుకు సాగలేదు. ఆ పేరుతో ఐదేళ్లపాటు గత వైసీపీ ప్రభుత్వం రాయలసీమ ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకున్నది. దీంతో సీమ ప్రజలు పూర్తిగా మోసపోయారు. జగన్ మాటను నమ్మి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల జేబులకు చిల్లులు పడ్డాయి.

శ్రీశైలం జలాశయం నుంచి రాయలసీమలోని వివిధ ప్రాజెక్టులకు నీరందించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కీలకం. ఇక్కడి నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, ఎస్కేప్ కెనాల్ ద్వారా దిగువన ఉన్న ప్రాజెక్టులకు నీరు అందుతుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నీటి తరలింపు సామర్థ్యం 44 వేల క్యూసెక్కులు. దీనిని 80 వేల క్యూసెక్కులకు పెంచితే వరద ఎక్కువగా ఉన్న సమయంలో శ్రీశైలం నుంచి నీటిని తీసుకోవచ్చని గత ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే సాధ్యాసాధ్యాలను ఏమాత్రం ఆలోచించకుండానే అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.1095 కోట్ల వ్యయంతో 2021 ఏప్రిల్ 19న పోతిరెడ్డిపాడు విస్తరణ పనులను ప్రారంభించారు. మూడేళ్లలో పనులు పూర్తిచేసి దిగువ ప్రాంత రైతులకు సాగు, తాగుకు నీటిని అందిస్తామని గొప్పలు చెప్పారు. పర్యవేక్షణ లోపమా? లేక పోతిరెడ్డిపాడు విస్తరణపై అప్పటి ప్రభుత్వం శ్రద్ధ వహించకపోవటమా? అనేది తెలియదు కానీ ఈ పనులు ఏ దశలోనూ సరిగ్గా సాగలేదు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. ఇది చాలు.. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి తెలుసుకోడానికి.


ఇదీ పరిస్థితి..

పోతిరెడ్డిపాడు కాలువ సామర్థ్యం 80 వేల క్యూసెక్కులకు పెంచేందుకు పోతిరెడ్డిపాడు నుంచి బనకచర్ల వరకు 16 కిమీ మేర ఉన్న ఎస్ఆర్ఎంసీ (శ్రీశైలం మెయిన్ కెనాల్) కాలువ లైనింగ్, రక్షణ గోడతో పాటు పోతిరెడ్డిపాడుకు ఎగువన ఉన్న 9 కిలోమీటర్ల మేర ఉన్న అప్రోచ్ కాల్వ పూడికతీత పనులు కూడా చేపట్టాలి. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఎస్ఆర్‌బీసీ కాలువ 57 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు కూడా చేయాలి. అయితే వీటిలో ఏ పనీ ఓ కొలిక్కి రాలేదు. పోతిరెడ్డిపాడుకు దిగువన ఉన్న ఎస్ఆర్ఎంసీకి నాలుగు కిలోమీటర్ల మేర ఊటవాగు వరకే సైడ్ లైనింగ్ పనులు చేయగా, ఫ్లోర్ లైనింగ్ పనులను మాత్రం ఆరు కిలోమీటర్ల వరకు పూర్తి అయినట్లు తెలుస్తోంది. అవి కూడా పూర్తిగా చేశారా? అంటే అదీ లేదు. మధ్య మధ్యలో అసంపూర్తిగా వదిలేశారు. కాలువపై అక్కడక్కడా చేపట్టాల్సిన వంతెనల పనులు కూడా అంతంత మాత్రమే పూర్తయ్యాయి. కాలువ వెంట రక్షణ గోడను మాత్రం 9 కిలోమీటర్ల మేర నిర్మించారు. ఎగువన అప్రోచ్ కాలువ 9 కిమీ మేర పూడిక తీయాల్సి ఉండగా, 4 కిమీ మాత్రమే పూడిక తీశారు. ఇక ఎస్ఆర్‌బీసీ కాలువకు 57 కిలోమీటర్లు లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా, కేవలం 5 కిలోమీటర్లు కూడా పనులు పూర్తికాని పరిస్థితి. మొత్తమ్మీద వైసీపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు విస్తరణ పనుల్లో పూర్తి నిర్లక్ష్యం వహించింది.

ఊటవాగు నుంచి నిలిచిపోయిన లైనింగ్ పనులు



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద అసంపూర్తిగా ఎస్సార్ఎంసీ లైనింగ్ పనులు



సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండానే..

పోతిరెడ్డిపాడు నుంచి 80 వేల క్యూసెక్కుల నీరు తరలించేలా పనులు చేపట్టే విషయంలో గత వైసీపీ ప్రభుత్వం ముందు చూపులేకుండానే వ్యవహరించిందన్న విమర్శలు అప్పట్లోనే వినిపించాయి. 44 వేల క్యూసెక్కుల సామర్థ్యం మేరకు కూడా కాలువలు పటిష్ఠంగా లేవు. అలాంటి కాలువల్లో 80 వేల క్యూసెక్కుల తరలింపు సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అసలు పోతిరెడ్డిపాడును 80 వేల క్యూసెక్కులకు సామర్థ్యాన్ని పెంచాలంటే.. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద మొదలయ్యే ఎస్సార్బీసీ, తెలుగుగంగ, ఎస్కేప్ కాలువ నీటి తరలింపు సామర్థ్యాన్ని కూడా పెంచాలి. అయితే ఈ కాలువలను ఎంత వెడల్పు చేశారు? ఏయే కాలువలను ప్రస్తుతమున్న సామర్థ్యం నుంచి ఎంత పెంచేందుకు పూనుకున్నారనేది అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులకే తెలియాలి. అసలు 44 వేల క్యూసెక్కుల సామర్థ్యమున్న సమయంలోనే 2021వ సంవత్సరంలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఎక్కువ ఉండటంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నీటిని దిగువకు వదిలేందుకు నిర్ణయం తీసుకుంది. పోతిరెడ్డిపాడు కాలువ నిర్వహణ సరిగా లేకపోవటంతో పాటు, సామర్థ్యం సరిపోక పాములపాడు - ఎర్రగూడూరు మధ్యలో నీరు ఎగదన్ని చుట్టు పక్కల ప్రాంతాలను ముంచేసింది. అలాంటిది పోతిరెడ్డిపాడు, బనకచర్ల క్రాస్‌రెగ్యులేటర్ తర్వాత ఉన్న ఎస్సార్బీసీ, తెలుగుగంగ, ఎస్కేప్ కెనాల్ కాలువల వెడల్పు పనులు చేపట్టకుండా, కేవలం లైనింగ్ పనులు చేపట్టి 80 వేల క్యూసెక్కుల నీటిని ఎలా తరలిస్తారు? అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ విషయం పట్టించుకోలేదు.

చేతులెత్తేసిన గుత్తేదారు...?

వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్న నమ్మకంతో టెండర్లకు పిలవగానే కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. పోతిరెడ్డిపాడు విస్తరణ పనులను కోసం కాంట్రాక్టర్లు రెండేళ్లలో దాదాపు రూ.300 కోట్ల మేర ఖర్చు చేశారు. అయితే ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన బిల్లుల గురించి అసలు పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిలు చాలా వరకు పెండింగ్‌లో ఉండిపోయాయి. చేసిన పనులకు కాంట్రాక్టర్లు మొదట్లో రూ. 62 కోట్ల వరకు బిల్లులు పెట్టారు. బడ్జెట్ లేదంటూ వాటిని కూడా వైసీపీ ప్రభుత్వం మంజూరు చేయలేదు. జగన్ ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. అన్నీ కలిసి పోతిరెడ్డిపాడు విస్తరణ పనులు పూర్తిగా ఆగిపోయాయి.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (నూనెపల్లె), జూలై 12: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ రాజకుమారి ఉపాధ్యాయులను ఆదేశించారు. నంద్యాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణాన్ని, పాఠశాల నిర్వహణ రికార్డులను ఆమె పరిశీలించారు. విద్యార్థినులతో మమేకమై మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. పాఠశాలలోని తాగునీటి ట్యాపులను పరిశీలిస్తూ శుద్ధ జలాన్ని అందిస్తున్నారా? లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు పాఠశాల హెచ్‌ఎం పద్మావతి ఉన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయండి

కలెక్టర్‌కు ఉద్యోగుల సంఘం వినతి



కలెక్టరేట్ ఎదుట దర్నా చేస్తున్న ఉద్యోగులు

నంద్యాల (కల్చరల్), జూలై 12: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యనారాయణపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని నంద్యాల జిల్లా ప్రభుత్వోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రప్ప, తిరుపాలయ్య తదితరులు కలెక్టర్ రాజకుమారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ముందుగా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ సంఘాల నాయకులు ర్యాలీ, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగేంద్రప్ప మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్‌ను కలిసినందుకే అక్రమ కేసులు బనాయించారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందక పని భారం పెరిగి, ఉద్యోగ కార్మిక ఉపాధ్యాయ వర్గాల్లో ఆత్మాభిమానం దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు, చర్యలు చాలా ఆందోళనలు కలిగించాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సూర్యనారాయణపై ఉన్న అక్రమ కేసులన్నీ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి : జేసీ



చిరుతపులి సంచరించిన ప్రాంతాలను పరిశీలించిన జేసీ

మహానంది, జూలై 12: మహానంది పరిసర ప్రాంతాల్లో ఇటీవల చిరుతపులి సంచరించిన ప్రాంతాలను నంద్యాల జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అంతకుముందు జేసీ మహానంది మండల తహసీల్దార్ కార్యాలయంలో అటవీ, దేవదాయశాఖ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో చిరుతపులి సంచారంపై ప్రజలను అప్రమత్తం చేయాలనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మహానంది పరిసర ప్రాంతాల్లో చిరుతపులి సంచరించడం వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో ఒక్కరు కాకుండా గుంపులు గుంపులుగా బయటకు వెళ్లాలన్నారు. కొద్ది రోజుల్లో చిరుతపులిని బంధించేందుకు అనుమతులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా, ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, మండల తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, దేవస్థానం ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పనుల పురోగతిపై జడ్పీ చైర్మన్ సమీక్ష

కర్నూలు(కల్చరల్), జూలై 12: జడ్పీలోని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న పనుల పురోగతిపై జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం జడ్పీలోని మినీ సమావేశ భవనంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 5 శాతం ఎస్సీ ఈఎంఎఫ్, 6 శాతం ఎస్టీ ఈఎంఎఫ్, 5 శాతం డబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ ఈఎంఎఫ్ కింద మంజూరైన పనుల పురోగతిపై సమీక్షించారు. జడ్పీ సీఈఓ నాసరరెడ్డితోపాటు జడ్పీలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఈ ఆగస్టు మాసానికంతా ప్రారంభం కాని పనులను పూర్తి చేసి, సదరు రికార్డులను చెల్లింపుల కోసం జడ్పీ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. 6 శాతం ఎస్టీ ఈఎంఎఫ్ పనుల కింద 5 పనులకు గాను, అంచనా మొత్తం రూ.23 లక్షలు, 5 శాతం డబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ ఈఎంఎఫ్ కింద 25 పనులకు గాను, అంచనా మొత్తం రూ. 08.9 లక్షలు వెరసి మొత్తం 30 పనులు ప్రారంభం కాలేదని, ఈ ఈఎంఎఫ్ పనులన్నీ ఈ ఏడాది సెప్టెంబరు మాసాంతంతో లాప్స్ అవుతాయని, వాటిని త్వరితంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, బనగానపల్లి, డోన్ సబ్ డివిజన్ల డిప్యూటీ ఈఈలు, ఏఈలు హాజరయ్యారు.

కబ్జా స్థలంలో రాళ్ల తొలగింపు

- జేసీబీతో ఆక్రమణలను తొలగించిన అధికారులు
- ఆదోనిలో వైసీపీ కబ్జాదారుల నుంచి మున్సిపల్ పార్కు స్థలానికి విముక్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, జూలై 12 : ఆదోనిలో వైసీపీ భూ అక్రమాలకు ఎమ్మెల్యే, అధికారులు చరమగీతం పాడుతున్నారు. పట్టణంలోని అమరావతి నగర్‌లో సర్వే నెం. 8 /2, 82, 345లో దాదాపు రూ.కోట్ల విలువ చేసే రెండెకరాల మున్సిపల్ పార్కు స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు వేసి రాళ్ల నాటిన వైసీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, భూకబ్జాదారుడు ఎర్రిస్వామి భూ అక్రమణలపై ఆంధ్రజ్యోతిలో గురువారం వైసీపీ కబ్జాలో అమరావతినగర్ అనే శీర్షికతో కథనం అచ్చయింది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ హసీనా సుల్తానా, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఆ స్థలం కబ్జాకు గురైన మున్సిపల్ పార్కు స్థలానికి ఎవరికి పట్టాలు ఇవ్వలేదని ఎమ్మెల్యే చెప్పడంతో తక్షణమే ఆ రాళ్లను తొలగించి, ఆ స్థలానికి కంచే వేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం ఆంధ్రజ్యోతి భూకబ్జాదారులను వదిలే ప్రసక్తే లేదు అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో అధికారులు ఎక్స్‌కవేటర్‌తో పార్కులో ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన రాళ్లను పెకలించిన ఆ రాళ్లను ట్రాక్టర్‌లో వేసుకొని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం ఈ పార్కు స్థలంలో ముళ్లకంపలను తొలగించి కంచే వేసి కాపాడుతామని అధికారులకు తెలిపారు. ఆదోనిలో మార్పుకు నాంది పలకడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



తొలగించిన రాళ్లను మున్సిపల్ కార్యాలయానికి తరలిస్తున్న ట్రాక్టర్

రోజుకో మలుపు..!

- మిస్టరీ వీడని వాసంతి మిస్సింగ్ కేసు
- పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తున్న బాలురు
- ముచ్చుమర్రిలో డీఐజీ తనిఖీలు
- ఆరో రోజు కూడా బయటపడని ఆనవాళ్లు



ముచ్చుమర్రి పోలీస్టేషన్ ముందు గ్రామస్తుల ధర్నా

నందికొట్కూరు, జూలై 12: బాలిక అదృశ్యం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. నిన్నటి వరకు నీటిలో పడేశామని చెప్పిన ముగ్గురు బాలురు.. శుక్రవారం భూమిలో పూడ్చిపెట్టామని చెప్పారు. దీంతో ఆ ప్రదేశాన్ని చూపించాలంటూ ముగ్గురు బాలురను స్వయంగా డీఐజీ విజయరావు తీసుకొని ముచ్చుమర్రి, వనములపాడు పరిసరాలను తనిఖీ చేశారు. అయినా బాలిక ఆనవాళ్లు కనిపించలేదు. ఓ వైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మరో వైపు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వాసంతి ఘటనపై స్పందించారు. నిజానిజాలను వెలికితీసి దోషులను పట్టుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. దీంతో పోలీసులపై ఒత్తిడి పెరిగిపోతోంది. ఏకంగా డీఐజీ రంగంలోకి దిగినా వాసంతి ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసుల అదుపులో ఉన్న బాలురు మాత్రం పూటకో సమాధానం చెబుతూ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. దృశ్యం సినిమాను తలపించే విధంగా వాసంతి కేసులో విచారణ రోజుకో విధంగా మలుపు తిరుగుతోంది.

పూటకో మాట చెబుతున్న మైనర్లు

వాసంతి అదృశ్యం కేసులో అనుమానితులుగా ఉన్న బాలురు పూటకో



కొత్త ముచ్చుమర్రి శ్మశానవాటిక వద్ద కేసీ కాలువపై తనిఖీలు చేస్తున్న డీఐజీ

మాట చెబుతున్నారు. ముందుగా కొత్త ముచ్చుమర్రి వద్ద శ్మశానవాటికలో పూడ్చిపెట్టామని చెప్పడంతో అక్కడకెళ్లి పోలీసులు పరిశీలించారు. అనంతరం శ్మశానానికి అవలి వైపున ఉన్న కేసీ కెనాల్ పోరంబోకు భూమిలో పూడ్చిపెట్టామని చెప్పడంతో అక్కడా తనిఖీలు చేశారు. అనంతరం వనములపాడు సమీపంలో పూడ్చిపెట్టామని చెప్పడంతో అక్కడ కూడా పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి ఆచూకీ కనిపించకపోవడంతో డీఐజీ ముగ్గురు బాలురను తీసుకొని పగిడ్యాల మీదుగా నందికొట్కూరుకు చేరుకున్నారు. దీంతో డీఐజీ వెళ్లిన వెంటనే ముచ్చుమర్రి నుంచి వనములపాడు వరకు కేసీ కెనాల్ పక్కనున్న ముళ్ల పొదలను తొలగించే పనిలో రెవెన్యూ అధికారులు పడ్డారు. ఇలా రోజుకో సమాధానం చెబుతూ ముగ్గురు బాలురు పోలీసులతో ఆడుకుంటున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఆరు రోజులవుతున్నా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు, బాలిక బంధువులు, కాలనీలోని ప్రజలు ముచ్చుమర్రి పోలీస్టేషన్‌ను ముట్టడించారు. ఎస్ఐ జయశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం పోలీసు వ్యవస్థ వాసంతి కోసమే గాలిస్తోందని అన్నారు. శనివారం ఎలాగైనా వాసంతి ఆచూకీ తెలుస్తుందని బాధితులకు సమాధానం చెప్పారు.

● పోలీసుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం:

విచారణ కోసం ముచ్చుమర్రికి వచ్చిన డీఐజీ విజయరావుతో వాసంతి కుటుంబ సభ్యులు మాట్లాడేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమి జరుగుతుందన్న విషయం కనీసం కుటుంబ సభ్యులకు తెలియజేయకుండా డీఐజీ వెళ్లడం సరైంది కాదంటూ మండిపడ్డారు.

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

పోలీసు స్టేషన్ వద్దకే బాధితులను పిలిపించిన వైనం

నందికొట్కూరు రూరల్, జూలై 12 : ముచ్చుమర్రి గ్రామానికి వెళ్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. వాసంతి తల్లిదండ్రులు, బంధువులను పరామర్శించడానికి వెళ్తుండగా బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున, జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని చెప్పి బ్రాహ్మణ కొట్కూరు పోలీస్టేషన్‌కు తరలించారు. బాధితులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి మాట్లాడించారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు పెద్దఎత్తున బ్రాహ్మణకొట్కూరు స్టేషన్‌కు చేరుకుని తమ నాయకుడిని వదిలిపెట్టాలని కోరారు. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితి బీహార్‌లోగాని, మణిపూర్‌లోగానీ లేదన్నారు. ఇది ఎవరు చేయిస్తున్నారో తనకు తెలుసు అన్నారు.



బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ని అడ్డుకుంటున్న పోలీసులు

కొనసాగుతున్న గాలింపు చర్యలు



ముచ్చుమర్రి ఎత్తిపోతల వద్ద గాలింపు చర్యలు చేపట్టిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

పగిడ్యాల, జూలై 12: మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసుల ఆధ్వర్యంలో సోలార్ స్కానింగ్, డిప్ డ్రైవింగ్ వంటి అత్యాధునిక పద్ధతులను అనుసరించి కాలువలో 35 అడుగుల లోతుకు వెళ్లి గాలింపు చర్యలు చేపడుతున్నారు. బాలిక ఆచూకీ లభ్యమౌతుందన్న ఆశతో తల్లిదండ్రులు, బంధువులు కాలువ వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

బాలిక కుటుంబానికి పరామర్శ

వాసంతి కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు రుకియా బేగం శుక్రవారం పరామర్శించారు. బాలిక తల్లి సుజాతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, మంగవల్లి తదితరులు ఉన్నారు.

ముచ్చుమర్రిలో అదే టెన్షన్

విచారణ నిమిత్తం గ్రామానికి వచ్చిన డీఐజీ

మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామంలో వాసంతి అదృశ్యం గురించే చర్చ నడుస్తోంది. డీఐజీ విజయరావు బాలురను గ్రామానికి తీసుకొని వచ్చి విచారణ చేపట్టారు. గ్రామంలోని కేసీ కాలువ సమీపంలోని శ్మశానవాటిక వద్ద పరిశీలించారు. అక్కడి నుంచి కేసీ కాలువ వెంట వెళ్లి కొంత దూరంలో ముళ్లపొదల వద్ద నిలిపి తనిఖీ చేశారు. అక్కడి నుంచి పడమర వనములపాడు, పగిడ్యాల మీదుగా నందికొట్కూరుకు వెళ్లారు. డీఐజీ, పోలీస్ అధికారులు గ్రామానికి రావడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, బాలిక బంధువులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోవడంతో బాలిక బంధువులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

19న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జూలై 12: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, నూతనంగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యే ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. వ్యవసాయశాఖ, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విద్యుత్ శాఖలపై చర్చ ఉంటుందన్నారు.

రైలు నుంచి కిందపడి మహిళకు తీవ్ర గాయాలు

తుగ్గలి, జూలై 12: రైలులో ప్రయాణిస్తున్న మహిళ కింద పడి తీవ్ర గాయాలపాలైంది. శుక్రవారం మండలంలోని రామలింగాయపల్లె, పగిడిరాయి స్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగింది. కింద పడిన మహిళను గమనించిన రైతులు డయల్ 100కి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు 108 అంబులెన్సును పంపించి క్షతగాత్రురాలిని పత్తికొండ వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉండటంతో ఆమె ఎవరనే వివరాలు తెలియలేదు. ఎరుపు, నలుపు పూలు ఉన్న చూడీదార్, కాఫీ కలర్ లెగ్గిన్ వేసుకుంది. అయితే.. ఆమె రైలులో నుంచి జారీ పడిందా.. లేదా ఎవరైనా రైలు నుంచి కిందకు తోసేశారా.. అన్నది తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న జొన్నగిరి ఎస్ఐ చంద్ర పత్తికొండ వైద్యశాలకు వెళ్లి బాధితురాలిని పరిశీలించారు. అయితే రైలులో నుంచి జారీ పడటంతో రైల్వే పోలీసుల పరిధిలోకి వెళ్తుందా.. జొన్నగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందా అనేది పరిశీలించి కేసు నమోదు చేస్తామన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



కంది విత్తనాలను ఉచితంగా అందజేస్తున్న బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

గోనెగండ్ల, జూలై 12: సమగ్ర సస్యరక్షణ చర్యలతో కంది పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అశోక్, నిరంజన్, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి రైతులకు సూచించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గోనెగండ్ల గ్రామాన్ని అపరాలు అనే ప్రోగ్రాం కింద దత్తత తీసుకున్నారు. దీంతో గోనెగండ్లలోని రైతులకు ఉచితంగా నాలుగు కేజీల కంది విత్తనాలను బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంది పంటను ఈ నెల చివరి వరకు సాగు చేసుకోవచ్చునని వర్షాధార పరిస్థితుల్లో బెట్టను తట్టుకోవచ్చునని తెలిపారు. ఎకరానికి నాలుగు కేజీల విత్తనాలు సరిపోతాయని, విత్తే వరుసల మధ్య దూరం 90 సీఎంలు ఉండాలని వరుసలో మొక్కల మధ్య దూరం 20 సెంటీమీటర్ల నుంచి 30 సెంటీ మీర్ల వరకు ఉండాలని సూచించారు. ఎకరానికి ఎనిమిది కేజీ నత్రజని, 20 కేజీల భాస్వరం వేసుకోవాలన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో హేమలత, టీడీపీ నాయకులు నజీర్‌సాహెబ్, తిరుపతయ్యానాయుడు, బేతాబడేసా, రమేష్‌నాయుడు, చిన్ననేలటూరు నాగన్న, ఏఈ శ్రీహరి, వీఏఏ మహేంద్ర పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి

దేవనకొండ, జూలై 12 : కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం కుంకనూరు రోడ్డులో జరిగింది. కుంకనూరు గ్రామానికి చెందిన నాగర్జున (32) ఆటో నడుపుతూ జీవనం సాగించే వాడు. శుక్రవారం రాత్రి గ్రామానికి వెళ్తుండగా రోడ్డుపై కుక్క అడ్డం వచ్చింది. దాన్ని తప్పించబోయి ఆటో బోల్తాపడటంతో నాగర్జున తీవ్రంగా గాయపడ్డాడు. .స్థానికులు గమనించి వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య మానస, ఏడాది పాప ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

డోన్(రూరల్), జూలై 12: డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామంలో మాధవయ్య అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో డోన్ పట్టణ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. పట్టణ సమీపంలోని దత్తాత్రేయ స్వామి ఆలయ సమీపంలో నిందితులు చెన్నయ్య నాయుడు, ఇంద్రప్రతాప్ నాయుడు, రంగన్న నాయుడు, సురేష్ నాయుడు, మహేశ్వరి, లక్ష్మీదేవిలను అరెస్టు చేసి వారి నుంచి రెండు వేటు కొడవళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డోన్ పట్టణ ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు. నిందితులను డోన్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆగ్రోస్‌లో తవ్వేకొద్ది భారీ కుంభకోణాలు

- స్వచ్ఛాంధ్ర కోసమని నాసిరకం ట్రాక్టర్లకు రూ.30 కోట్ల ఖర్చు
- డెలివరీ కాకముందే అడ్వాన్సులు
- నిగ్గు తేల్చాలంటూ వ్యవసాయ మంత్రికి వినతి పత్రం అందించిన అసోసియేషన్ నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 12: రైతులకు ప్రయోజనం చేకూర్చే దిశగా కార్యక్రమాలు చేపడుతున్న ఆగ్రోస్ సంస్థను గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిర్వీర్యం చేశారని ఏపీ ఆగ్రోస్ సంస్థ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం అమరావతిలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంటు కృష్ణారెడ్డి ఆగ్రోస్ సంస్థలో తవ్వేకొద్ది భారీ కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా సంస్థకు చెందిన రూ.101 కోట్ల నిధుల డిపాజిట్లను బ్యాంకుల్లో కుదువపెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఏ విధంగా ఖర్చు చేశారో సమగ్ర వివరాలతో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం అందజేశామని అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంటు కృష్ణారెడ్డి ఫోన్‌లో విలేకరులకు తెలిపారు. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చి అక్రమాలకు పాల్పడిన ఉన్నతాధికారులతో పాటు ఆనాటి చైర్మన్, ఎండీలపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామని అన్నారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ రెండు రోజుల్లో వస్తుందనగా.. ఆనాటి ఆగ్రోస్ సంస్థ ఎండీ, చైర్మన్లు సంస్థకు సంబంధించిన రూ.101 కోట్ల డిపాజిట్లను తనఖా పెట్టి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అవసరమైన ట్రాక్టర్లను కొనుగోలు చేసేందుకు రూ.30 కోట్లను ఖర్చు చేశారని వినతి పత్రంలో మంత్రికి పూర్తి వివరాలతో బుక్‌లెట్‌ను అందించామని తెలిపారు. ఈ బుక్‌లెట్‌లో 1వ పేజీ నుంచి 53వ పేజీల్లో పూర్తి స్థాయిలో ఆగ్రోస్ సంస్థ ద్వారా ఏ విధంగా నిధులను అడ్డదిడ్డంగా దోచిందీ వివరాలను ప్రభుత్వానికి అందించామని కృష్ణారెడ్డి తెలిపారు. స్వచ్ఛాంధ్ర పేరుతో మహేంద్ర, తదితర కంపెనీల్లో తయారైన నాసిరకం ట్రాక్టర్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమాలకు పాల్పడ్డారని, ట్రాక్టర్లను డెలివరీ చేసుకోకముందే అడ్వాన్సులను పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. వీటన్నింటి మీద సమగ్ర విచారణ చేపడితే.. ఇంకా ఎన్నో అవినీతి అక్రమాలు వెలుగులోకి వస్తాయని మంత్రిని కోరినట్లు తెలిపారు.



వ్యవసాయ మంత్రిని కలిసిన ఆగ్రోస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

దళిత మహిళ హత్య

- ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వైనం
- భూ తగాదాలే కారణం
- ఆదోని మండలం నాగనాథహళ్లిలో ఘటన



గుండమ్మ (ఫైల్)



పురుషోత్తంరెడ్డిని కొడుతున్న దృశ్యం



దాడికి ముందు...

ఆదోని రూరల్, జూలై 2: భూతగాదాలో భాగంగా ఓ మహిళను ట్రాక్టర్‌తో గుద్ది హతమార్చిన సంఘటన ఆదోని మండలంలోని నాగనాథహళ్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. నాగనాథళ్లికి చెందిన గుండమ్మ(47)కు ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో వివాహమైంది. వీరికి సంతానం లేదు. భర్త మరణంతో ఆదోనికి చెందిన పురుషోత్తం రెడ్డితో కలిసి గుండమ్మ రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించింది. నాగనాథన హళ్లి గ్రామానికి చెందిన నలుగురు అన్నదమ్ముల్లో ఒకరైన సోమశేఖర్‌రెడ్డి మృతి చెందడంతో ఆయన భార్య తిరుమలమ్మ పుట్టినిల్లు మదిరెకు చేరుకొంది. ఆమె తన భాగానికి వచ్చిన సర్వే నెం.500-డిలోని నాలుగు ఎకరాల పొలాన్ని రియల్టర్ గుండమ్మకు 2019లో విక్రయించింది. గుండమ్మ ఈ పొలాన్ని సాగు చేస్తుండగా తిరుమలమ్మ భర్త కుటుంబీకులైన తండ్రీ కొడుకులు రాఘవరెడ్డి, శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఉదయం అడ్డుకున్నారు. గుండమ్మ, ఆమె వ్యాపారంలో భాగస్తుడైన పురుషోత్తంపై రాఘవరెడ్డి కర్రతో దాడి చేశారు. అక్కడితో ఆగకుండా శ్రీధర్‌రెడ్డి ట్రాక్టర్‌తో గుండమ్మను ఢీకొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన పురుషోత్తంరెడ్డిని స్థానికులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులు, పీరయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి పెంపుడు కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు జడ్డ శ్రీధర్‌రెడ్డి, జడ్డ రాఘవరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బోయ రామకృష్ణ, దాసరి గోవిందులపై ఎస్సీ, ఎస్టీ కేసులతోపాటు హత్య కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇదిలా ఉండగా గుండమ్మను హత్య చేసిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ దాడుల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గుండమ్మకు పిల్లలు లేకపోవడంతో అనాథాశ్రమంలో ఇద్దరు చిన్నారులను దత్తతకు తీసుకుని పెంచి పోషించింది. కుమారుడు కిషోర్ ఆటో నడుపుతున్నాడు. కుమార్తె శృతికి గుండమ్మ వివాహం చేసింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, వైసీపీ నాయకులు పరామర్శించారు.

నగరంలో సత్యా ఏజెన్సీస్ రెండో షోరూమ్ ప్రారంభం

కర్నూలు(కల్చరల్), జూలై 2: ప్రముఖ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విక్రయ సంస్థ సత్యా ఏజెన్సీస్ వారి 25వ షోరూమ్ (కర్నూలులో రెండో షోరూమ్)ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో కేథడ్రిల్ చర్చి ఎదురుగా ఉన్న నూతన భవనంలో ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. షోరూమ్ ప్రారంభోత్సవాన్ని బిల్డింగ్ యజమాని మాకం నాగేషు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ ఏపీ హెడ్ సెంథిల్, వివిధ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సత్యా ఏజెన్సీస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న షోరూమ్ బిల్డింగ్ ఓనర్ మాకం నాగేషు, తదితరులు

ముగ్గురిపై కేసు నమోదు

నందవరం, జూలై 12: అక్రమంగా ఇతరుల భూమిని తమ పేరు మీదకు బదలాయించుకున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నందవరం ఎస్ఐ తిమ్మయ్య శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని మాచాపురం గ్రామానికి చెందిన కసిరెడ్డి శివారెడ్డి, నరసమ్మ దంపతులు నందవరంలో స్థిరపడ్డారు. గ్రామంలో వీరికి సర్వే నెంబరు 112-ఏలో 4.12 ఎకరాలు, సర్వే నెంబర్ 113-ఏలో 1-99 సెంట్ల పొలం ఉంది. దీన్ని మాచాపురం గ్రామస్తులైన మోషన్న, రత్నంలకు కౌలుకు ఇచ్చారు. వారు మృతి చెందాక మోషన్న కుమారులు సాగర్, విజయ రాజు కౌలుకు చేసుకునేవారు. కొన్నేళ్లగా వారు కౌలు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో పొలం వదిలి పెట్టాలని భూ యజమానులు చెప్పారు. దీంతో విజయరాజు, సాగర్ 3.10 ఎకరాల భూమిని తహసీల్దార్ కార్యాలయంలో రెడ్ మార్క్ పెట్టించారు. మిగతా 3.01 ఎకరాల భూమిని రత్నం కుమారుడు సుధీర్‌కుమార్ పేరు మీద ఆన్‌లైన్, అడంగల్, రిజిస్టర్‌లో చేర్చుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న భూ యజమానులు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన అనంతరం ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

'మెరుగైన పారిశుధ్యానికి చర్యలు'



దేవదాయశాఖ స్థలంలో నిలిచిన మురుగును పరిశీలిస్తున్న ఎంపీడీవో భాగ్యలక్ష్మి

పాణ్యం, జూలై 12: పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాణ్యం ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అయ్యపురెడ్డి కాలనీలో దేవదాయశాఖ స్థలంలో నిలిచిన మురుగును పరిశీలించారు. సంబంధిత అధికారులకు నోటీసులు అందజేశామన్నారు. ఇప్పటికే ఈ నీటిలో ఆయిల్ బాల్స్, వేస్ట్ ఆయిల్‌ను పిచికారీ చేసి దోమల నివారణ చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనందరావు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



శాంతినిలయం గ్రామంలో పోషకాహారం అందిస్తున్న ఎంపీడీవో

పాములపాడు, జూలై 11: మండలంలోని శాంతినిలయం గ్రామం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సరస్వతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? లేదా?, బాలింతలకు అందించే పోషకాహారం గూర్చి ఆరా తీశారు. చిన్నారులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు అలాగే గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఎర్రగూడూరు గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సమయా పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. లేకపోతే చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు.

శాతనకోటలో 'బాలసభ'



బాలల సంరక్షణ గురించి మహిళలకు వివరిస్తున్న సూపర్‌వైజర్

నందికొట్కూరు రూరల్, జూలై 12: నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామంలోని 3వ అంగనవాడీ సెంటర్‌లో బాలికల సంరక్షణ గురించి గ్రామంలోని మహిళలతో బాలసభ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ, మహిళా పోలీస్ పద్మ, వెంకటరవణమ్మ భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం గురించి వివరించారు. తల్లిదండ్రులు లింగ వివక్ష లేకుండగా ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచాలని సూచించారు. బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. మహిళా సాధికారత, మహిళా శక్తి గురించి వారికి వివరించారు. చిన్నారుల సంరక్షణ, కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. బాలికలను సంరక్షించు కోవడం సమాజంలో మన అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అక్కమ్మ, లలిత, వెంగమ్మ, ఆశా వర్కర్లు మంజుల, పరమేశ్వరి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థినులు

జూపాడుబంగ్లా, జూలై 12: జూపాడుబంగ్లా ఆదర్శ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఎంపికైన సుప్రజ, మోక్షితగౌడు, నవ్య అనే విద్యార్థినులను అభినందించారు. సుప్రజ, మోక్షితగౌడు నూజివీడుకు, నవ్య ఇడుపులపాయకు కళాశాలలకు ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు. బాగా చదివి మంచిపేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

'హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 12: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నంద్యాల డీటీవో కార్యాలయ ఎంవీఐ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంవీఐ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా తలకు గాయాలై మృతిచెందిన ఘటనలు ఉన్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాద నివారణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డీటీవో కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యంత్రాల చోరీపై కేసు నమోదు

పాణ్యం, జూలై 12: మండలంలోని నూలుమిల్లు యంత్రాల చోరీపై కేసు నమోదు చేసినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్ శాఖ ఏడీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దొంగతనం చేసిన వ్యక్తులు, అమ్మకాలు జరిగిన ప్రదేశాలను గుర్తించామన్నారు. ఏడీ హరికృష్ణ మాట్లాడుతూ మిల్లు సెక్యూరిటీపై జాయింట్ కలెక్టరు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

27 నుంచి డీవైఎఫ్ఐ శిక్షణ తరగతులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 12: నంద్యాలలో ఈ నెల 27 నుంచి 30వతేది వరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్ శుక్రవారం తెలిపారు. శిక్షణా తరగతులకు యువతి, యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివ, అశోక్, సురేష్, సుంకన్న, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు బలిజల ఆత్మీయ సమావేశం

నంద్యాల (నూనెపల్లె), జూలై 12: నంద్యాల బలిజ సంఘీయుల ఆధ్వర్యంలో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, బలిజ సంఘీయుల కళ్యాణ మండపం కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుర్రాల రవికృష్ణ, కళ్యాణ మండపం కమిటీ చైర్మన్ వర్దన్‌శెట్టి రాజారాం హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బలిజ, కాపు సామాజిక వర్గాల మద్దతుతో కూటమి భారీ విజయం సాధించిందని, అందుకుగాను ఆదివారం ఉదయం నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్‌హాల్‌లో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి దుర్గేష్ ఎమ్మెల్సీ రామచంద్రయ్య, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు హాజరవుతున్నట్లు చెప్పారు. బలిజ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: జేసీ

గోస్పాడు, జూలై 12: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని యాళ్ళూరు గ్రామంలో శుక్రవారం కౌలు రైతు గుర్తింపు కార్డుల సదస్సును జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ యజమానుల భూ హక్కులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటపై మాత్రమే కౌలు దారుడికి హక్కు ఉండేలా ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. యజమానులు తమ పొలాన్ని సాగు చేసుకునే కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పొందేందుకు సహకరించాలన్నారు. కౌలు గుర్తింపు కార్డు ద్వారా పంట నమోదు చేస్తారని, ప్రభుత్వం కల్పించే పంటల భీమా, పంట నష్ట పరిహారం చెల్లింపు, పంట కొనుగోలు, తదితర ప్రయోజనాలు వర్తిస్తాయని అన్నారు. ఒకే కుటుంబంలోని కుటుంబ సభ్యుల మధ్య కౌలు కార్డులు వర్తించబడవని, 11 నెలల కాల వ్యవధితో సీసీఆర్‌సీ కార్డులో ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. సీసీఆర్‌సీ కార్డుల కోసం రైతులు తమ తమ సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలలోని అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌వోలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నమ్మ, ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, గోస్పాడు తహసీల్దార్ భార్గవి, ఏవో స్వప్నిక, డీటీ విజయశేఖర్, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

'వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి'



వంతెన పనులను పరిశీలిస్తున్న డీఈ రఘురామిరెడ్డి

పగిడ్యాల, జూలై 12: మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో కేసీ కాలువపై వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కేసీ కెనాల్ డీఈ రఘురామిరెడ్డి సూచించారు. గ్రామంలో చేపట్టిన వంతెన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ నెల రోజులలోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సైడ్ వాల్ పనులు జరుగుతున్నాయని, కేసీ కాలువకు నీరు విడుదల చేసే లోపు దిమ్మెలకు సంబంధించిన పనులు పూర్తిచేసే ఇబ్బంది ఉండదని అన్నారు. సుంకేసుల రిజర్వాయర్‌లో ప్రసుత్తం ఒక టీఎంసీ నీరు నిల్వ ఉందని, ఈ నీటితో కర్నూలు ప్రజల తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. కేసీ కాలువకు నీటి విడుదల విషయం గురించి అడుగగా ఐఏబీ సమావేశం అనతరం నీటి విడుదలపై స్పష్టత వస్తుందన్నారు. కేసీ కెనాల్ ఏఈ నరేష్ తదితరులు ఉన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'



గోపవరంలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

మహానంది, జూలై 12: పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యంగా ఉండవచ్చని గ్రామ పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

● 26 తులాల బంగారం, నగదు అపహరణ

నంద్యాల (నూనెపల్లె), జూలై 12: నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగజ్జననీ నగర్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. అదే కాలనీలో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడగా మరో ఇంట్లో విఫల యత్నం చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. జగజ్జననీ నగర్‌కు చెందిన మాతంగి పుల్లయ్య ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంట్లోని 20 తులాల బంగారు, రూ.లక్ష నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. రామచంద్రన్ అనే వ్యక్తి పని మీద ఇంటికి తాళం వేసి కర్నూలుకు వెళ్లారు. ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి రూ. 20 వేలు నగదు, ఆరు తులాల బంగారాన్ని అపహరించుకుని వెళ్లారు. అదే కాలనీలో ఫణీంద్ర శర్మ ఇంట్లో చోరీకి విఫల యత్నం చేశారు. బాధితులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

'జయప్రదం చేయండి'

వెలుగోడు, జూలై 12: కర్నూలులో ఈ నెల 20వ తేది అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సర్వ సభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు పిలుపునిచ్చారు. వెలుగోడులో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు, వ్యవసాయ కూలీల పట్ల ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండకడుతూ వారి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ జిల్లా కార్యదర్శి దుర్గా పాల్, లాలునాయక్, మల్లికార్జున తదిరతులు పాల్గొన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'



స్టూడెంట్ కిట్ అందజేస్తున్న తులసీరెడ్డి

నంద్యాల రూరల్, జూలై 12: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి అన్నారు. నంద్యాల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన స్టూడెంట్ కిట్లను హెచ్ఎం ఆధ్వర్యంలో తులసిరెడ్డి పంపిణీ చేశారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అందరికి విద్య అందించాలని అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ నారాయణ, విద్యా కమిటీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సాగుదారు హక్కు పత్రాలు పొందాలి'



మట్టి నమూనాను సేకరిస్తున్న అధికారులు

నంద్యాల రూరల్, జూలై 12: పంటలను సాగుచేసే కౌలు రైతులు సాగుదారు హక్కు పత్రాలు పొందాలని మండల వ్యవసాయాధికారి వరప్రసాదరావు సూచించారు. మండలంలోని పుసులూరు, మిట్నాల తదితర గ్రామాలలో కౌలు రైతులకు శుక్రవారం సాగుదారు హక్కు పత్రాల జారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు హక్కు పత్రాలు కలిగిన రైతులు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను పొందవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట కోల్పోయినపుడు నష్ట పరిహారం పొందడానికి, ప్రభుత్వానికి పంటను అమ్ముకోవడానికి కౌలు కార్డు తప్పనిసరి అని అన్నారు. కౌలు రైతులందరూ సాగుపత్రాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలతో వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. భూహక్కు పత్రాల కాల పరిమితి 11 నెలలు మాత్రమేనని చెప్పారు. పుసులూరు గ్రామంలో సాగు రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షల కోసం మట్టినమూనా సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాలలో మట్టి నమూనా సేకరణ ప్రారంభించినట్లు తెలిపారు.

'కఠినంగా శిక్షించాలి'

నందికొట్కూరు, జూలై 12: బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఏపీ రాష్ట్ర ఉమెన్ కమిషన్ సభ్యురాలు రోఖియా బేగం, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం వాల్మీకి నగర్, వడ్డే పేట స్కూలు నుంచి పగిడ్యాల రోడ్డు ట్యాంక్ వరకు ర్యాలీగా వెళ్లి సెంటర్లో ఏపీ రైతు సంఘం, దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ముచ్చుమర్రి గ్రామానికి వెళ్తున్న రాష్ట్ర ఉమెన్స్ కమీషన్ సభ్యురాలు రోకియా బేగం రాస్తారోకోలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీను, గౌరవాధ్యక్షులు డా. చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం నాయకులు కాటిపోగు సోమన్న, రామకృష్ణ, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

● పగిడ్యాల మండలంలోని ఓ గ్రామంలో 9 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏబీడీఎస్‌వో-ఏఐఎంఎస్ఎస్ సంఘాల ఆధ్వర్యంలో 5 రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. ఏబిడిఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు హరీష్ కుమార్‌రెడ్డి, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తేజోవతి, ఏబీడీఎస్‌వో నగర అధ్యక్ష, కార్యదర్శులు జహీర్, మల్లేష్, ఏఐఎంఎస్ఎస్ నాయకులు రోజా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల మండలంలోని ఓ గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలంటు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బాలిక పోస్టర్‌ను చేతపట్టుకొని బాలిక బంధువులు, మహిళలు అధిక సంఖ్యలో కొత్త ముచ్చుమర్రి నుంచి పాత ముచ్చుమర్రి వరకు ర్యాలీ చేపట్టారు.

జూపాడుబంగ్లా: పగిడ్యాల మండలంలో బాలికను హత్యచేసిన నిందితులను శిక్షించాలని వాల్మీకుల సంఘం మండల కన్వీనర్ రాముడు ఆధ్వర్యంలో తూడిచర్ల గ్రామంలో నిరసనలు వ్యక్తం చేశారు. జూపాడుబంగ్లాలో పొదుపు మహిళ గ్రామైక్య సంఘం మహిళలు గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

మిడుతూరు: పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో బాలికపై జరిగిన సంఘటనకు మండల కేంద్రం మిడుతూరు చెన్నకేశవ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. శివ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మిడుతూరు బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

ఆత్మకూరు, జూలై 12: సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. ఆత్మకూరులోని అర్బన్ కాలనీ, కొత్తపేట ఏరియాలను శుక్రవారం ఆయన సందర్శించి ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. ప్రత్యేకించి ఆయా కాలనీల్లోని ఇళ్లను పరిశీలించి ఇంటి పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రత్యేకించి ఇంటి పరిసరాల్లో, నీటితొట్టిలు, పూలకుండీల తొట్టిల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి ప్రదేశాల నుంచే దోమల వ్యాప్తి జరుగుతోందని వివరించారు. అదేవిధంగా ఏదైనా అరోగ్య సమస్యలు ఉన్నట్లయితే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, బైర్లూటి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గోపాల్, ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు షాజిదా ఫిర్దోస్ ఉన్నారు.

ఆత్మకూరు రూరల్: జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఆత్మకూరు మండలం ముష్టపల్లి గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వరరావు, మండల వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. డెంగీ జ్వరాలు మరింత విస్తరించకుండా పారిశుధ్యంపై దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు. డ్రైడేలో భాగంగా ఎంపీడీవో శివప్రసాద్ వర్మతో కలిసి గ్రామంలో దోమల లార్వాల నివారణ కోసం ఖాళీగా ఉన్న డ్రమ్ములు, నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. గ్రామంలో పలు చోట్ల బ్లీచింగ్ పౌడర్ క్లోరినేషన్ చేయించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మండలంలోని వైద్య సిబ్బంది ఎప్పటికపుడు గ్రామాలలోని వార్డులలో పర్యటిస్తూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్, ఈవోఆర్డి మోహన్‌కుమార్, సీహెచ్‌వో అహ్మద్‌బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ముష్టపల్లి గ్రామంలో ఖాళీ డ్రమ్మును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి చీర



జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జూలై 12: ప్రపంచంలోనే 2వ జగజ్జననీ ఆలయంగా ప్రసిద్ధిగాంచిన నంద్యాల జగజ్జననీ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పించుకుంటారు. శుక్రవారం ఆషాడమాసం సందర్భంగా జగజ్జననీ అమ్మవారికి ఒంగోలు, ఆదోని, కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బళ్లారి, ఎన్.కొట్టాల నుంచి మహిళా భక్తులు అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకొని వచ్చి సమర్పించారు. అనంతరం జగజ్జననీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పుట్టింటి పట్టుచీరె -సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

శాకాంబరీదేవిగా దర్శనమిచ్చిన వాసవీమాత



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

ఆత్మకూరు, జూలై 12: ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ అమ్మవారు శాకాంబరీమాతగా భక్తులకు దర్శనమచ్చారు. ఏటా ఆషాడమాసంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలో భాగంగా శుక్రవారం అమ్మవారిని ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శాకాంబరీ దేవిగా అలంకరించారు. లోకకళ్యాణార్థం నిర్వహించే ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి వారాహిదేవీ అభిషేకాలతో పాటు కుంకుమార్చనలు, లక్ష పుష్పార్చనలు, లలితాసహస్రనామాలు, పారాయణాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు విశేషంగా తరలివచ్చి వాసవీ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

పల్లకిలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, జూలై 12: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు పల్లకీ సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పల్లకిపై మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులు చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఆలయ పురవీధుల గుండా పల్లకీ ఉత్సవాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ



స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, జూలై 12: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులను సమర్పించారు.

● శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

● శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం షష్టి తిథిని పురస్కరించుకుని లోక కళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకులు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణ పతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జూలై 12: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం దాలిపర్తి దుర్గా నరసింహారావు, చల్లపల్లి బృందంతో కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, భో..శంభో, శివాష్టకం, అర్ధనారీశ్వరం, అర్ధనారీశ్వర తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

'వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి'

బండిఆత్మకూరు, జులై 12: విద్యార్థులు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్పెషల్ ఆఫీసర్ దాక్షాయిని సూచించారు. శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో డ్రైడే ఫ్రైడే, డెంగీ వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ముందుగా స్థానిక వైద్య అధికారులు ఎలాంటి వ్యాధులు సోకకుండా డీడీటీ పిచికారీ చేశారు. ఎస్‌వో మాట్లాడుతూ ఎలాంటి అస్వస్థత అనిపించినా వైద్యులతో చికిత్సలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న సీఎం


పల్లా శ్రీనివాసరావును సన్మానిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జూలై 12: సీఎం చంద్రబాబు హామీలను నెరవేరుస్తూ చేతల ప్రభుత్వంగా పాలన అందిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా సుబ్బారెడ్డి కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకువస్తూ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులను సీఎం చంద్రబాబు నెల రోజులకే కల్పించారన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయాధికారి తంగమణి

డోన్(రూరల్), జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శక్రవారం డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఆర్టీవో క్రాంతి కుమార్ హాజరై మాట్లాడారు. మోటారుసైకిల్ నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పేపర్ బ్యాగులను వినియోగించుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 12: విద్యార్థులు ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా పేపర్ బ్యాగులను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ బొమ్మిడాల డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు పాలిథిన్ కవర్, క్యారీ బాగుకు బదులుగా పేపరు బ్యాగులను వినియోగించుకోవాలన్నారు. ఆంగ్లోపన్యాసకుడు వీవీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పేపరు బ్యాగు పర్యావరణ హితమైనందున త్వరగా నీళ్లలో కరుగుతాయని వివరించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పేపరు బ్యాగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీదేవి, టి. అన్నపూర్ణ, డాక్టర్ రాజు, భాస్కర్‌నాయక్, నాగేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కొలిమిగుండ్ల, జూలై 12: ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని కొలిమిగుండ్ల ఎంపీడీఓ ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కోవెలకుంట్ల, జూలై 12: పగిడ్యాల మండలం ముచ్చుమర్రికి చెందిన బాలిక వాసంతి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నంద్యాల జిల్లా నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో ప్రజా సంఘాల, విద్యార్థి సంఘాల నాయకులు, సీపీఎం నాయకులు కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీసర్కిల్‌లో మాన వహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాసంతి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బాషా, సుధాకర్, కత్తి ఓబులేసు, మాబుహుసేన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాజీనామా చేయాలి

డోన్(రూరల్), జూలై 12: పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో హత్యకు గురైన చిన్నారి వాసంతి సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పద్మ తక్షణమే రాజీనామా చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం డోన్‌లో ఆయన మాట్లాడుతూ వాసంతిని హత్య చేసిన నింది తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

డోన్(రూరల్), జూలై 12: అంగన్‌వాడీలకు ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు జులైఖ, ఎస్తారు డిమాండ్ చేశారు. శుక్రవారం డోన్ సీపీఐ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. నాయకులు మల్లిక, స్వర్ణ లత, మస్తాన్‌బీ, నిర్మల పాల్గొన్నారు.

మరుగుదొడ్ల టెండర్లలో అవకతవకలు

డోన్(రూరల్), జూలై 12: ప్యాపిలి ఆర్టీసీ బస్టాండు మరుగుదొడ్ల టెండర్లలో అవకతవకలు జరిగాయని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్‌లు ఆరోపించారు. శుక్రవారం డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గత మే నెల 20న ప్యాపిలి ఆర్టీసీ బస్టాండు మరుగుదొడ్లకు టెండర్లు వేశారని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

భూసార పరీక్షలు కీలకం

కొలిమిగుండ్ల, జూలై 12: వ్యవసాయ సాగులో భూసార పరీక్షలు అత్యంత కీలకమైనవని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో మట్టి సేకరణ పనులు కొనసాగుతున్నాయని ఆమె వివరించారు.

బేతంచెర్ల: పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీఈవో రాఘవ అన్నా శుక్రవారం కొలుములపల్లెలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అంజలి, ఎంపీఈవో రాఘవలు పొలాల్లో పరీక్ష కోసం మట్టి సేకరించారు. రైతులు మట్టి పరీక్ష చేయించుకోవలంటే అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ఠ

- అందని శుద్ధ జలం
- దెబ్బతిన్న భవనాల పైకప్పులు
- ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు

ప్యాపిలి, జూలై 12: మండలంలోని సంక్షమ హాస్టళ్లలో సమస్యలు తిష్ఠ వేశాయి. మరుగుదొడ్లు, శుద్ధజలం సౌకర్యం లేకపోవడంతో పాటు వివిధ సమస్యలతో వసతి గృహాలు కొట్టిమిట్టాడుతున్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం వలన విద్యార్థులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. పట్టణంలోని బాలికల ఎస్సీ వసతి భవనం అధ్వానంగా తయారైంది. అక్కడ శుద్ధ జలం లేక బాలికలు ఉప్పునీరు తాగాల్సివస్తోంది. పాడైపోయిన మినరల్ ప్లాంట్‌కు మరమత్తులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. అలాగే మండలంలోని రాచెర్ల బీసీ హాస్టల్, జలదుర్గంలోని ఎస్సీ బాలుర వసతి భవనం, పట్టణంలోని బాలుర బీసీ హాస్టల్‌లో కూడ సమస్యలు తాండవిస్తున్నాయి. భవనాల పైకప్పులు దెబ్బతిన్నాయి. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. నీటి వసతి సరిగా లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు నాలుగైదేళ్లుగా పరిస్థితులు ఇలాగే ఉన్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో విద్యార్థులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. వసతి భవనాల్లో సౌకర్యాలు లేకపోవడంలో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించడానికి ఇష్టపడటం లేదని తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


జలదుర్గం వసతి భవనంలో దెబ్బతిన్న భవనం పైకప్పు


రాచర్ల హాస్టల్‌లో నిరుపయోగంగా మరుగుదొడ్లు

గ్రామాభివృద్ధే టీడీపీ లక్ష్యం: ఎమ్మెల్యే


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

చాగలమర్రి, జూలై 12: గ్రామాల అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని మల్లేవేముల గ్రామం నుంచి కలుగొట్లపల్లె గ్రామానికి వెళ్లే గ్రావెల్ రోడ్డు పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.కోటితో 3.5 కిలోమీటర్ల మెటల్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలాగా శిలాఫలకాలకు పరిమితం కాబోమని, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని అన్నారు. సర్పంచ్ ఈదుల సరోజమ్మ, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జమాల్ రెడ్డి, శివయ్య, ఓబయ్య, శేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, జగన్‌రెడ్డి, నందివాహనరెడ్డి, ఓబన్న, ప్రమోద్, శివరామిరెడ్డి, ఎల్.ఓబులేసు, నరసింహ, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, డీఈ నరసింహులు, ఏఈ కొండారెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: నంద్యాల కలెక్టర్ రాజకుమారిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లడంతో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ


ఆలమూరులో ఎరువుల బస్తాలను తనిఖీ చేస్తున్న ఏవో శ్రీకృష్ణ

రుద్రవరం, జూలై 12: మండలంలోని ఆలమూరు గ్రామంలో శుక్రవారం మదీన ఏజెన్సీలో ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేసి రిజిస్టరును పరిశీలించారు. ఎరువులు కొన్న రైతులు రసీదు తప్పనిసరిగా పొందాలన్నారు. ఏవో శ్రీకృష్ణ మాట్లాడుతూ నాణ్యత లేని, కల్తీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎరువుల దుకాణం ముందు యాజమాన్యం ధరల పట్టిక ఉంచాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈవో రాజు ఉన్నారు.

రేవనూరు దర్గాలో బీసీ రాజారెడ్డి ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న బీసీ రాజారెడ్డి

కోవెలకుంట్ల, జూలై 12: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోదరుడు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి రేవనూరు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం మంత్రి బీసీ మరిన్ని పదవులు చేపట్టాలని టీడీపీ నాయకుడు లాయర్ ఆలీహుసేన్ కోవెలకుంట్ల నుంచి రేవనూరుకు 14 కి.మీ పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో మంత్రి బీసీ సోదరుడు బీసీ రామనాథరెడ్డితోపాటు సంజామల మండలం, కోవెలకుంట్లకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా బీసీ రామనాథరెడ్డి ఆలీహుసేన్‌కు అభినందనలు తెలిపి పాదయాత్రను ప్రారంభించారు. లాయర్ ఆలీహుసేన్ కోవెలకుంట్ల నుంచి రేవనూరు హుసేన్‌వలి దర్గాకు చేరుకున్నారు. మంత్రి బీసీ సోదరుడు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అక్కడికి చేరుకుని ఆలీహుసేన్‌ను అభినందించారు. అనంతరం దర్గాలోకి వెళ్లి హుసేన్‌స్వామికి ఫతేహా నిర్వహిచి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య, విష్ణుశేఖర్‌రెడ్డి, ఆకుమళ్ల రమణారెడ్డి, ముక్కమల చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజామలలో కేబుల్ దొంగలు

- మోటారు, రూ.2లక్షల కేబుల్ వైరు చోరీ


మోటారుకు కట్‌చేసిన వైరును చూపుతున్న వాటర్‌మెన్

సంజామల, జూలై 12: మండల కేంద్రంలో 30మంది రైతుల పంపుసెట్‌ల విద్యుత్ కేబుల్ వైరు చోరీకి గురైంది. గ్రామానికి నీటి సరఫరా చేసే పంపుసెట్ వైర్లతోపాటు గ్రామానికి చెందిన రైతులు క్రిష్ణమూర్తి, నారాయణ, చంద్రయ్య, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, పుల్లయ్య, సత్యంతోపాటు మరో 22 మంది వ్యవసాయ భూముల్లో ఉన్న విద్యుత్ పంపుసెట్ల కేబుల్ వైర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కత్తిరించుకొని వెళ్లారు. వైర్లతోపాటు ఏకంగా హుసేన్ వలి అనే రైతు పంపుసెట్ మోటారునే దుండగులు ఎత్తికెళ్లారు. శుక్రవారం ఉదయం రైతులు పొలాలకు వెళ్లి చూడగా కేబుల్ వైర్‌లను దొంగలు కత్తిరించుకొని వెళ్లారు. కొత్తపల్లె రస్తా నుండి పాలేరువాగు పరివాహకంలో ఉన్న దాదాపు 30మోటార్ల కేబుల్ వైరు అపహరణకు గురైంది. ఒక్కొక్క రైతుకు సంబంధించి 20 నుంచి 30మీటర్లు రూ. 2 లక్షలు విలువ చేసే కేబుల్ వైరు చోరీకి గురైంది.

శాకంబరి అలంకారంలో పార్వతీదేవి


పార్వతీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూలై 12: చాగలమర్రి గ్రామంలోని కోదండ రామాలయంలో ఆషాడమాసం సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో పార్వతీదేవికి పండ్లు, కూరగాయలు, ఆకులతో అలంకరించారు. పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూలై 12: రుద్రవరం కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. మహిళలు బోనాలు, చీరలు సమర్పించారు.

కలెక్టర్‌ను కలిసిన రామ్‌కో ప్రతినిధులు


కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు

కొలిమిగుండ్ల, జూలై 12: మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ అధికారులు నూతన కలెక్టర్ రాజాకుమారిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, అడ్మిన్ ప్రెసిడెంట్ రామ రాజు, శోభన్‌బాబులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా రామ్‌కో సిమెంట్ యాజమాన్యం గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్‌కు వివరించారు.

'760 ఎకరాల్లో పండ్ల తోటల సాగు'


మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీడీ సాంబశివరావు

ఉయ్యాలవాడ, జూలై 12: ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద 760 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపడుతున్నామని ఉపాధి ఏపీడీ సాంబశివరావు అన్నారు. శుక్రవారం పెద్దయమ్మనూరు గ్రామంలో ఉపాధి పనులు పరిశీలించి మస్టరు తనిఖీ చేశారు. ఏపీడీ మాట్లాడుతూ తమ క్లస్టరు పరిధిలోని 8 మండలాల్లో 384 మంది రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు వచ్చారన్నారు. ఇప్పటికి 400 ఎకరాల్లో పండ్ల తోటల సాగులో భాగంగా మామిడి, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, జామ తదితర 16 రకాల పండ్ల తోటలు సాగు చేస్తున్నామన్నారు. పండ్ల తోటల సాగుకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఏపీవో రవి ప్రకాశ్, ఎఫ్ఏటీలు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన టీడీపీ బీసీ సెల్ నాయకుడు

డోన్, జూలై 12: రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమల్‌రావును టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డీజీపీని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అదేవిధంగా రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

దొర్నిపాడు, జూలై 12: మండలంలోని ఆయా గ్రామాల్లోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కౌలు గుర్తింపు కార్డులపై పలు సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఏఈవో సురేంద్ర, వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

'కౌలు గుర్తింపు కార్డులతో ప్రయోజనాలు'

శిరివెళ్ల, జూలై 12: కౌలు గుర్తింపు కార్డులతో(సీసీఆర్‌సీ) కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. శిరివెళ్లలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో కౌలు రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సీసీఆర్‌సీ కార్డులు పొందేందుకు అర్హత కలిగిన కౌలు రైతులు వారి ఆధార్ కార్డుతో పాటు భూ యజమాని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సు ప్రతులతో ఆయా గ్రామాల వీఆర్వోలను సంప్రదించాలన్నారు.

రైతులకు మంచి రోజులు

ప్యాపిలి, జూలై 12: టీడీపీ అధికారంలోకి రావడంతో రైతులకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. మండలంలోని చంద్రపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశుసంవర్ధక శాఖ సంబరాల్లో భాగంగా రైతులకు పశుగ్రాసం విత్తనాలను, వ్యాక్సిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పశువులు, గొర్రెలు రోగాల బారిన పడిన ఎటువంటి మందులు, వ్యాక్సిన్ పంపిణీ చేయలేదన్నారు. దీంతో మూగజీవాలు మృత్యువాతన పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీఏ కిషోర్, వైద్యాధికారి విద్యాసాగర్, బీజేపీ మండల అధ్యక్షులు దామోదర్‌నాయుడు, ఆదినారాయణ, రామక్రిష్ణ, సందీప్, సురేంద్ర, చంద్ర, మోహన్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

నంద్యాల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.60 వేలు మంజూరైనట్లు ఆళ్లగడ్డ తహసీల్దార్ నజీర్ అహమ్మద్ చెప్పారు. పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. తాగునీటి సమస్య ఉందని విద్యార్థినులు చెప్పడంతో ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీరు సరిపోకపోవడంతో అదనంగా మోటార్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారని తహసీల్దార్ చెప్పారు.

వ్యక్తిపై దాడి

నంద్యాల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలో నివాసం ఉంటున్న శీను అనే వ్యక్తిపై నిఖిల్, మనోజ్ మరో ఐదుగురు శుక్రవారం దాడి చేసి గాయపరిచారు. శీను ఆళ్లగడ్డ ఆర్టీసీ బస్టాండు నుంచి పట్టణంలోకి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా జీపులో వెంబడించి పట్టుకొని కర్రలతో కొట్టి చింతకొమ్మదిన్నె గ్రామం వద్ద వదిలేశారు. ఆ గ్రామ ప్రజలు 108కు సమాచారం ఇవ్వడంతో బాదితుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

అవుకు. జూలై 12: అవుకు మండలం గడ్డమాకులపల్లె గ్రామంలోని దేవరకొండ చిన్నగంగన్న ఇంటి వద్ద 260 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌బాబు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గడ్డమాకులపల్లె గ్రామంలోని చిన్న గంగన్న ఇంటిలో నాటుసారా ఉన్నట్లు సమాచారం రావటంతో పోలీసులు దాడిచేసి నాటుసారాను స్వాధీనం చేసు కొని పంచనామా నిర్వహించామన్నారు. చిన్న గంగన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాడి పశువులకు పచ్చిగడ్డి ఆధారం

సంజామల, జూలై 12: పాడి పశువులకు పచ్చిగడ్డి ఆధారమని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని గిద్దలూరు గ్రామంలో పశుగ్రాస క్షేత్రాన్ని ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పచ్చిగడ్డి ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యులు డాక్టర్ శివానంద, రమేష్, రఘుబాలక్రిష్ణ, పద్మావతి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సుబ్బయ్య, మహబూబ్ బేగ్, షరీఫ్, హుసేన్ బాషా పాల్గొన్నారు.

అక్రమ కేసులు రద్దు చేయాలి

డోన్(రూరల్), జూలై 12: గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘం కార్యదర్శి సునీల్, సెక్రటరి లక్ష్మణ్ నాయక్, కృష్ణకుమార్ ఉన్నారు.

వైభవంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ

బనగానపల్లె, జూలై 12: నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్ర వారం అమ్మవారి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకిలో ఊరే గించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచిత ఇసుక పాలసీ పేదలకు వరం


పీవీ కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జూలై 12: సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ పేదలకు వరం లాంటిదని టీడీపీ మండల అధ్యక్షుడు పీవీ కుమార్ రెడ్డి అన్నారు. బనగానపల్లె మడలం నందవరం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. నందవరం గ్రామానికి చెందిన ఆదిశేషులు, అశోక్, రామకృష్ణ, శివ, రాఘవ, సన్న, గోపాల్ కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా పీవీ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ అరాచక పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, వెంగన్న, చిరంజీ విరెడ్డి, యుగంధర్‌రెడ్డి, రమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మధుమోహన్, లారీ సుబ్బారెడ్డి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య వేలం పాటలు

చాగలమర్రి, జూలై 12: మండలంలోని ముద్దూరు గ్రామంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి, ఈశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన భూములకు శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య వేలం పాటలను దేవదాయశాఖ ఈవో నర్సయ్య ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు దేవదాయశాఖ అధికారులు వేలం పాటలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి పరిధిలో 83 ఎకరాలు, ఈశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 18.75 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించారు. 134 సర్వే నంబర్‌లోగల 11.84 ఎకరాలకు రూ.85 వేలు, 200 సర్వే నంబర్‌లో గల 1.11 ఎకరాలకు రూ.7 వేలు, 223 సర్వే నంబర్‌లో 9.24 ఎకరాలకు రూ.20 వేలు, 254 సర్వే నంబర్‌లో 6.84 ఎకరాలకు రూ.20,500, 13.33 ఎకరాలకు రూ.18,500, 1.67 ఎకరాలకు రూ.7,500, 16.26 ఎకరాలకు రూ.62 వేలు వేలం పాటలో పాడినట్లు ఈవో తెలిపారు. ఈశ్వరస్వామికి చెందిన 18.75 ఎకరాలకు రూ.1.20 లక్షలు వేలం పాట జరిగినట్లు ఈవో చెప్పారు. 2024 నుంచి 2025 వరకు మాత్రమే భూములు కౌలుకు ఇచ్చామని తెలిపారు. ఎస్ఐ రమణయ్య, ఏఎస్ఐ నబీసాహెబ్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈవో సాయిచంద్ర, రమణయ్య, కిషోర్‌శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్యుల పని తీరుపై విచారణ

చాగలమర్రి, జూలై 12: చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు ఇమ్రాన్, అంజలి పని తీరుపై శుక్రవారం డీపీఎంవో సునీత ఆధ్వర్యంలో బృంద అధికారులతో విచారణ చేపట్టారు. వైద్యుల విధులపై వేరు వేరుగా విచారణ చేశారు. 13 సచివాలయాల పరిధిలోని ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టులతో విడివిడిగా విచారణ చేశారు. వారి అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. వైద్యులు నిర్వహిస్తున్న విధులపై విచారణ చేశారు. విచారణ నివేదికలను డీఎంహెచ్‌వోకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ గురుస్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్‌సన్ పాల్గొన్నారు.